

# నీడంకాదు తోడుల

—గోవిందరాజు సీతాదేవి

దీపావళి పండుగ మిగతా అన్ని పండుగల్లా కాదు పిల్లలకీ పెద్దలకీ అత్యంత వుత్సాహ ప్రదమైన పండుగ. ఈ పండుగ నాలుగు రోజులు వుందనగానే శివరావు గారు యిద్దరు అల్లుళ్లకీ వుత్తరాలు రాశారు.

'పండగకి అమ్మాయినీ పిల్లలనీ తీసుకుని తప్పక రమ్మని', అలాగే కొడుక్కి రాశారు. కోడలూ నువ్వూ పిల్లలూ కల్సి పండక్కి రమ్మని. ఆయన వుత్తరానికి వెంటనే జవాబులు వచ్చేశాయి. 'మీరు రాసిన ప్రకారం అలాగే వస్తున్నాం' అని.

శివరావు ఓ పెద్ద కంపెనీలో చిన్న వుద్యోగం చేస్తున్నాడు. జీతం కొన్త కొన్త పెరిగినా ఖర్చు అంతకు ముందే పెరిగిపోతూ వుండటం వల్ల "గొర్రెకి బెత్తెడే తోక" అనే సామెత ఆయన జీవితంలో యదార్థమై కూర్చుంది. ఆయనకి ముగ్గురు ఆడపిల్లలు. ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్ళు యెలాగో చేసేశాడు. కానీ ఆఖరు ఆడపిల్ల పెళ్ళి చేయలేకపోతున్నాడు. శివరావుకి ఈ ముగ్గురు ఆడపిల్ల లేకాక వీరందరికన్నా పెద్దవాడైన ఒకే ఒక్క కొడుకువున్నాడు. అతన్ని యెంతో కష్టపడి చదివించాడు. స్వగ్రామంలో వున్న యెకరం పొలం పాత ఇల్లూ అతని యం.కాం చదువుకి అయిపోయింది. కామేశ్వర్రావు యం.కాం పాసైనప్పుడు శివరావూ ఆయన భార్య రుక్మిణమ్మ తమ కష్టాలు గట్టెక్కాయని గట్టిగా వూపిరి పీల్చుకున్నారు. యెందరి కాళ్ళో పట్టుకుని వున్న వూళ్ళో కొడుక్కి లెక్చరర్ వుద్యోగం యిప్పించుకున్నాడు శివరావు. ప్రైవేటు కాలేజీలోనే అనుకోండి.

కామేశ్వరరావుకి వుద్యోగం వచ్చి రెండు నెలలన్నా కాకుండానే "తోటి లెక్చరర్ అనూరాధని ప్రేమించాననీ రిజిష్టర్ మ్యారేజీ చేసుకున్నాననీ" నరాసరి ఆమెని తీసుకు వచ్చేశాడు.

ప్రాణానికి ప్రాణంగా పెంచిన ఒక్కగాను ఒక్క కొడుకు తన మనసుకి నచ్చిన పిల్లని పెళ్ళాడానంటే కాదని అనలేకా యిలా తమకి తెలియకుండా పెళ్ళాడటం యిష్టం లేకా మౌనంగా వుండిపోయారు శివరావు దంపతులు.

అనూరాధ సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగి పెళ్ళి చేసుకుని వచ్చినా అత్తవారింట్లో సౌకర్యాలు సరిగా లేవని మూతి ముడవసాగింది. ఆమె మూతి ముడిస్తే కామేశ్వర్రావు మనసు బాధపడిపోసాగింది. అది చూసిన శివరావు మనసులోనే నవ్వుకున్నారు.

ప్రతి మగాడికీ పెళ్ళి అయిన కొత్తలో భార్య అంటే పిచ్చి ప్రేమ వుండటం సహజం. ఆమెని తనింటికి తెచ్చుకుని బంగారు తూగుటుయ్యాలలో వూపాలని వుండటం కూడా సహజమే. కానీ యిది మధ్య తరగతి వారికి సాధ్యమా! ఓ నాలుగు నెలలు గడిస్తే సరి ఈ వూహలన్నీ గాలిలో యెగిరి చక్కా పోతాయి.

శివరావు అలా అనుకున్నాడే కానీ అలా జరగలేదు.

తమకి ప్రత్యేకంగా గదిలేదనీ పడుకునేందుకు మంచి మంచాలు లేవనీ కొడుకు నణగటం విన్పిస్తూనే వుంది తల్లిదండ్రులకి.

"ఈ పట్నవాసంలో మూడు గదుల ఈ వాటాకే ఆరువందలు అద్దె యిస్తున్నారు. ఈ వాటాలోకి నాలుగు వందల అద్దెలో చేరినా యజమాని పెంచిన అద్దె యిప్పటికి ఆరువందలై కూర్చుంది. మరో గదికావాలంటే మరి రెండు వందలు యివ్వక తప్పదు. కొడుకూ కోడలూ జీతం వారు హనీమూన్‌కి వెళ్ళటానికి చేసిన అప్పుతీర్చటానికే సరిపోతూందని చెప్తున్నాడు వుత్తరత్నం.

"పోనివ్వు ఆ అప్పుతీరిన తర్వాత కొన్త ఇంటి ఖర్చుకి చన్నీళ్ళకి వేడినీళ్ళుగా...." అనుకుని ఆశగా యెదురు చూడసాగింది రుక్మిణమ్మ.

మూడో జీతం అందుకుంటూనే కొడుకు చల్లగా చెప్పాడు.

"అమ్మా నాకూ అనూకీ కాలేజీ చాలా దూరం అయింది. అందుకనీ అక్కడికి దగ్గరగా యిల్లు చూసుకున్నాం."

రుక్మిణమ్మ గుండెలో రాయిపడింది. 'వేరు కాపరమా'

ఆవిడ కళ్ళు నీళ్ళతో నిండుకున్నాయి.

"వూళ్ళోనేకదమ్మా వారం వారం వస్తూనే వుంటాను." యిలా అంటూన్న కొడుక్కి యేం చెప్పగలదు. భర్త యిల్లు చేరగానే ఈ విషయం చెప్పి కళ్ళు తుడుచుకుంటూ

"వాడిని వెళ్ళవద్దని చెప్పకూడదూ" అంది.

"ఒద్దు.. వెళ్ళాలని వాళ్ళూ అనుకుని ఒక నిర్ణయానికి వచ్చినప్పుడు మనం ఆపటం మంచిదికాదు. నువ్వు బాధపడకు. వాళ్ళ కాపురానికి మనింట్లో పనికి వచ్చే సామాను ఏమైనా వుంటే యివ్వు అంతే" అన్నాడు శివరావు.

"ఏవో నాలుగు ఇత్తడి గిన్నెలు తీసి యిచ్చాను. వాటిని యిటు తిప్పి అటు తిప్పి చూసి 'యివేం ఒద్దులెండి' మేం మెల్లగా ఒక్కోటీ కొనుక్కుంటాం. అంతవరకూ యెలాగో యిబ్బంది పడతాం" అన్నది అనూరాధ.

"ఔనా! అయితే యింకేం మాట్లాడకు"

రుక్మిణమ్మ పెదవి కదపలేదు. అంతే కామేశ్వరరావూ అనూరాధా వేరే వెళ్ళిపోయారు. కొడుకు వుద్యోగ ప్రయత్నం కోసం చేసిన అప్పులు మాత్రం మిగిలిపోయాయి తల్లిదండ్రులకి.

ఆ తర్వాత యెలాగో కష్టపడి యిద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేశాడు శివరావు. పండగలకీ పబ్బాలకీ ఆడపిల్లలూ అల్లుళ్ళతోనే కొడుకూ కోడలూ వచ్చి సరదాగా నాలుగు రోజులు వుండి వెళ్ళిపోతారు. యిందుకే బోలెడంత సంతోషపడి పోసాగారు శివరావు దంపతులు.

కొడుకు వచ్చినప్పుడు తల్లితో చెప్పే కబుర్లు భలే వుంటాయి. "అమ్మా అనూ పోరు పెట్టి ఇంటికి కావాల్సిన సామానంతా కొనిపించేస్తోంది. ప్రతి వస్తువూ ఇన్‌స్టాల్‌మెంట్‌లో యిచ్చేస్తారుగా, అలాకొనేశాను. జీతంలో చాలా డబ్బు 'కట్' అవుతుందనుకో. మొన్నటికి మొన్న 'కలర్ టీవీ కావాల్సిందే' అని పేచీ పెట్టుకుని అలిగి కూర్చుంది. ఏం చేయను తెచ్చి యింట్లో పెట్టాను. అప్పటికి భోజనం చేసింది. ఆరు నెలల క్రితం చీటీ కట్టి మొన్ననే ఓ గొలుసు చేయించుకుంది. 'బేబీ' పేరుతో సేవింగ్స్ చేస్తూన్నాను. 'ఇద్దరి జీతం' అన్న మాటే కానీ నెలాఖరులో డబ్బుకి యిబ్బంది తప్పటం లేదు. 'ఔనా' అనేది. కొడుకు తమ కష్టసుఖాల విషయం ఒక్కనాడైనా అడగనందుకు లోలోపల బాధపడి పోతూనే పైకి ఏం మాట్లాడకుండా వారి కిష్టమైన వంటకాలన్నీ చేసి పెట్టి పంపేది. యిలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. తర్వాత తర్వాత ఆర్థిక పరిస్థితి అంత బాగులేనందువల్ల పిల్లలని పండగలకి పిలిచే అలవాటుని మానుకోవల్సి వచ్చింది.

ఈ దీపావళికి భర్త తనని సంప్రదించకుండానే పిల్లలని రమ్మని వుత్తరాలు రాయటం వారి జవాబులు చూసిన తర్వాత ఈ వార్త తనకి చెప్పటం ఆశ్చర్యం కల్గించింది.

"ఏమిటీ యెందుకిలా చేశారు! మన పరిస్థితి...." అంటూ భర్తని నిలదీసింది.

"రుక్కూ ఈ దీపావళి పిల్లలందరితో కల్సి జరుపుకోవాలని అనిపించిందోయ్."

"అందుకే రాశాను. పిల్లలు వచ్చి చాలా కాలం అయింది కదూ"

"ఔను. అదీ నిజమే. పిల్లలు వచ్చి యెన్నాళ్ళయిందో. మన పరిస్థితి యెప్పుడూ వుండేదే అనుకోండి అబ్బాయికి 'అరసెలంటే యిష్టం, పెద్దకూతురుకి చేగోడీలంటే యిష్టం. చిన్నల్లుడుకి బొబ్బట్లంటే యిష్టం. పెద్దల్లుడికి కారం గారెలంటే యిష్టం. 'కోడలికి మైసూర్ పాకం అంటే యిష్టం." అంటూ వాటి కన్నింటికీ కావల్సిన సరుకులన్నీ పచారీ కొట్లో పద్దు రాసి అతనిచ్చిన బిల్లు చూసి "అమ్మో యింత అయిందా" అనుకుంటూ గుండె పట్టుకుంది. ఆయన వెర్రికాకుంటే యీ అప్పు యెప్పటికి తీరేనూ అనుకుంది. కాస్త అయిష్టంగా మళ్ళీ అనుకుంది. అబ్బాయిని చూసి రెండేళ్ళు అయింది. వాడు వుద్యోగం బదిలీ అయి మరో వూరు వెళ్ళటం మరీ బాధ కల్గించింది ఆమెకి.

ఒక్కగాను ఒక్కకొడుకు. ప్రాణం కంటే మిన్నగా పెంచి పెద్ద చేసిన కొడుకు. తమ సర్వస్వంధారపోసి చదువు చెప్పించి తమకి వార్థక్యంలో ఆసరాగా నిలుస్తాడని గంపంత ఆశతో పెంచిన కొడుకు పెళ్ళికాగానే వేరు కాపురం పెట్టటం తర్వాత 'తన మంచి తనదే' అన్నట్లుగా మరో వూరు వెళ్ళటం ఆవిడ బాధే కల్గిస్తా వుంటుంది.

రుక్మిణమ్మ కొడుకుని చూసి సంవత్సరం దాటిపోయిందని మనసులో తగని దిగులు పడుతోందని శివరావుకి తెల్సు. అందుకే పండగ కూడా కల్సివస్తుందని రమ్మని రాశాడు వుత్తరం.

శివరావు మూడో కూతురు 'ఝాన్సీ' బి.కాం మూడో సంవత్సరం చదువుతూవుంది. టైపు హయ్యర్ పాసై షార్టుహాండ్ ప్రాక్టీస్ చేస్తోంది. అన్నా వదినా అక్కలూ బావలూ వస్తారని తెల్సిన క్షణం నుంచీ తెగ సంబరపడిపోతూవుంది. ఈ మధ్య ఇంట్లో మహాబోర్‌గా వుంది ఝాన్సీకి. తల్లీ తనూ తండ్రీ. ప్రతిరోజూ ఒకేలా యాంత్రికంగా గడిచి పోతూంటే తగని విసుగ్గా అన్పించసాగింది. తెల్లవారి లేవటం తల్లికి ఇంటిపనిలో సాయపడటం తర్వాత తండ్రితోబాటు భోజనం చేయటం కాలేజికి వెళ్ళటం రావటం. రాత్రి చదువుకోవటం భోజనం చేయటం నిద్రపోవటం. తన యింట్లోనే యిలా వుంటుంది. కానీ తన స్నేహితుల ఇళ్ళల్లో యిలా వుండదని ఝాన్సీకి తెల్సు. ఒక్కోప్పుడు తనీ యింట్లో పుట్టినందుకు తగని బాధ పడిపోయేది. కానీ బి.కాం చదువుకి వచ్చిన తర్వాత తన భావాలని కంట్రోల్ చేసుకోసాగింది. తల్లిదండ్రులని అర్థం చేసుకోసాగింది. తన కుటుంబ పరిస్థితిని గమనించి నడుచుకోసాగింది.

'శలవుల్లో సినిమాకి వెళ్ళిరామ్మా' అని తల్లి అన్నా మనసు సినిమా చూడాలని లాగుతున్నా సినిమాకిగాను అయే డబ్బు పెడితే నాన్న రెండు రోజులు పచ్చడి మెతుకు తో కాక కూరతో భోజనం చేస్తారు అన్న ఆలోచనరాగానే 'ఒద్దమ్మా సినిమా చూడాలని అన్పించటం లేదు' అనేసేది.

అలాంటప్పుడు రుక్మిణమ్మ కూతురు వైపు ప్రేమగా ఆత్మీయతగా చూస్తూ 'పిచ్చి తల్లీ మన పరిస్థితి యెప్పుడూ వుండేదేగా' అంటుంది.

'కాదమ్మా... మన పరిస్థితి యిలా యెప్పుడూ వుండదు. మారుతుంది. ఆరోజు తప్పక వస్తుంది.' అంటుంది భవిష్యత్తులోకి ఆశగా చూస్తూ.

'పిచ్చిపిల్ల' తనలో తనే నవ్వుకుంటుంది రుక్మిణమ్మ.

* * *

ఝాన్సీ ఇల్లంతా నీట్‌గా సర్దేసింది. యింక వంట గది సర్దటంలో మునిగిపోయింది. ఆదివారం కావటం వల్ల శివరావు ఇంట్లోనే వున్నాడు. భార్య పచారీ సామానులు బాగు చేసుకుంటూంటే అంతవరకూ యేదో వారపత్రిక తిరగేస్తున్న వాడల్లా దాన్ని మడిచి పక్కన పడేసి భార్యనే చూడసాగాడు.

తెల్లగా నల్లగా వున్న జుట్టు ముఖం మీద పడుతూ వుంది. నుదుట రూపాయంత కుంకుమ చెమటకి కాస్త కరిగి కిందకి జారివుంది. మెడలో నల్లపూసలూ పసుపుతాడూ చేతులకి వెలిసి పోయిన రంగు రంగుల మట్టి గాజులు సగం పాతబడిన కలనేత నూలు చీరెలో వున్న రుక్మిణమ్మని చూస్తూంటే యెందుకో ముప్పైయేళ్ళ క్రితం పెళ్ళి కూతురై తన యెడం చెయ్యిపట్టుకుని తనింట్లో అడుగు పెట్టినప్పుడు యెంత ఆరోగ్యంగా యెంత అందంగా వుండేదో గుర్తుకి రాసాగింది. పల్లెటూరిలో పాడీ పంటలున్న యింట్లో పుట్టి పెరిగిన రుక్మిణమ్మ ఏపుగా పెరిగి చూసేవారిని యిట్టే ఆకర్షించేలా వుండేది. కాపురానికి వచ్చిన తర్వాత సంసారంలో కష్టం సుఖం అనుభవిస్తూ వుంటే ఆ హుషారు క్రమంగా తగ్గి గృహిణిగా హుందాగా తన అర్థాంగిగా యిప్పటి వరకూ తలలో నాల్కలా మెసులుతూన్న భార్య వైపు చూసుకుంటూ యేదో తెలియని సంతోషాన్ని సంతృప్తినీ పొందుతూ తనని తను మరచివున్న శివరావుని యెందుకో తలెత్తి చూసింది రుక్మిణమ్మ.

"ఏమిటీ అలా చూస్తూన్నారు?" అడిగింది చేస్తూన్న పని ఆపి.

"నిన్నే చూస్తూన్నాను. నా జీవితంలో ప్రవేశించిన రుక్మిణికీ యిప్పటి రుక్మిణమ్మకీ వచ్చిన తేడాని అవలోకిస్తూన్నాను."

రుక్మిణమ్మ చిన్నగా నవ్వింది. నుదుట పట్టిన

చెమటని పమిటతో తుడుచుకుంటూ తిరిగి పనిలో లీనమవాలని చేసిన ప్రయత్నం వ్యర్థమై ఆ పని ఆపి అలాగే కూర్చుండిపోయింది.

జీవితం యెంత చిన్నదో అంత దీర్ఘమైంది అన్పిస్తూ వుంటుంది శివరావుకి.

జీవిత గమనంలో యెన్నెన్ని ఒడుదుడుకులు యెదుర్కున్నారో చెప్పటం కష్టం. ఈ ప్రయాణంలో యిద్దరూ అల్సిపోయారు. విశ్రాంతి కావాలని శరీరమూ మనసూ అప్పుడప్పుడూ మొండికేస్తూన్నాయి. అయినా ఆ మొండి తనాన్ని ఓ మొట్టికాయవేసి లేని శక్తిని తెచ్చుకుని ముందుకు సాగిపోతూన్నారు కర్తవ్య నిర్వహణకిగాను. దీనికి అంతం యెప్పుడు! అన్న ప్రశ్న అప్పుడప్పుడూ ఆయన మనసులో కదులుతూ వుంటుంది. జవాబు మాత్రం దొరకదు.

"ఏమిటీ యివాళ యేదో కొత్తగా వున్నట్లున్నారు. ఏమి ఆలోచిస్తూన్నారు." రుక్మిణమ్మ అడిగింది.

శివరావు తన ఆలోచనల్లోంచి బైట పడ్డాడు.

"ఏం లేదు రుక్కూ. రేపే కదూ పిల్లలందరూ వచ్చేదీ"

"ఔను రేపే"

"వారందరినీ రమ్మని నీకు పనియెక్కువ చేశాను. అసలే ఈ మధ్య నువ్వు త్వరగా అల్సిపోతున్నావు. అయినా నీకు శ్రమ యివ్వక తప్పలేదు"

"అల్సిపోతూన్న మాట నిజమే. కానీ పిల్లలందరూ వస్తారన్న సంతోషంలో అల్సట తెలియటం లేదు! కానీ డబ్బు ఖర్చునే మీరెలా సర్దుబాటు చేయగల్గుతారో అని భయంగా ఉంది."

"భయపడకు. అవన్నీ ఆలోచించకు."

"అలాగే"

శివరావులేచి పని వుంది అంటూ బైటకి వెళ్ళాడు.


ఝాన్సీ వంట గది సర్దుతూ పాడే పాట విన్పిస్తోంది రుక్మిణమ్మకి ఝాన్సీ గొంతు బావుంటుంది. యేపాట అయినా ఒక్కసారి విన్నదంటే ఆట్యూన్ పట్టేస్తుంది. యింట్లో కూనిరాగాలు తీస్తూ వుంటుంది. అలా పాడుతూ పని చేయటంలో వున్న థ్రిల్ ఝాన్సీకే తెల్సు.

* * *

మరునాడు. అన్నట్లుగానే యిద్దరు కూతుళ్ళూ, అల్లుళ్ళూ కొడుకూ, కోడలూ పిల్లలతో సహా వచ్చేశారు. ఝాన్సీ అందరికీ కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు యిచ్చింది. సామానులు లోపల పెట్టింది. కాఫీ తెచ్చి యిచ్చింది.

"నాన్నగారు యేరమ్మా' కాఫీ తాగుతూ కొడుకు అడిగాడు.

"ఉదయం పదిగంటలకే స్నానం చేసి పనివుందని బైటకి వెళ్ళారు భోజనం సమయానికి వచ్చేస్తానని చెప్పారు. మీరందరూ స్నానాలూ అవీ కానివ్వండి" అరుగో మాటలోనే వచ్చేశారమ్మా" ఝాన్సీ కేకపెట్టింది.






## వనిత—వంటకాలు

(వంటలపుస్తకం)

(రచన: జి.నిర్మలారెడ్డి; ప్రాప్తిస్థానం: సమతా నూవర్‌మార్కెట్, అమీర్ పేట, హైద్రాబాద్-500 016; వెల: రూ. 25; పేజీలు: 265)

'తెలుగుదేశంలోని వేర్వేరు ప్రాంతాలవారి అభిరుచులను, ఆహారపు అలవాట్లను దృష్టిలో వుంచుకుని ఈ పుస్తకం రాశాను.' అని అన్నారు రచయిత్రి జి.నిర్మలారెడ్డి. కాయగూరలతో వంటకాల నుంచి, మాంసాహార వంటకాలు, పచ్చళ్ళు, తీపి, కారం, ఫలహారాలు రకరకాల సూపులు చేసుకోవడం, సులభంగా అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు రచయిత్రి. ఈ పుస్తకంలో బిస్కట్లులు, కేకులు, కస్టర్డ్సు చేసుకునే విధానాన్ని రచయిత్రి ఆంగ్లంలో ఇచ్చారు. వీటి తయారీ విధానం కూడా తెలుగులో యిచ్చివుంటే తెలుగు గృహిణులకు మరింత ఉపయోగకరంగా వుండేది.

ప్రతివారిలోనూ ముఖ్యంగా మహిళలలో పాక శాస్త్రానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో రూపొందించబడ్డ ఈ పుస్తకం వనితలకు పుపయుక్తంగా వుండగలదు. □

శివరావు మెడలో దండతో చేతిలో రాధా కృష్ణుల బొమ్మతో లోపలికి రావటం చూస్తూన్న పిల్లలందరూ అలాగే నిలబడిపోయారు.

"ఏమిటిదీ?" అన్నట్లుగా ప్రశ్నార్థకంగా చూడసాగారు. ఆయన సరాసరి భార్య దగ్గరగా వచ్చారు.

"రుక్మిణీ ప్రతి మనిషికీ జీవితంలో ఓ చిన్న పూలదండ వేయించుకునే రోజు ఒకనాడు వస్తుంది నాకిది ఈనాడు వచ్చింది. ఆ అవకాశం యెలా వచ్చినా నా ఈ దండలో భాగం పంచుకునే 'హక్కు' నీకు వుంది అందుకే ఈ దండ నీ మెడలో వేస్తూన్నాను." అంటూ తన మెడలోని దండతీసి భార్య మెడలో వేశాడు. చేతిలోని రాధా కృష్ణుల బొమ్మని కూడా అమె చేతిలో పెట్టి ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి పిల్లలవైపు చూస్తూ "పిల్లలూ మీ దగ్గర కెమెరా వుంటే ఒక్క ఫొటో తీయండర్రా" అన్నారు.

కొడుకూ కోడలు కూతుళ్ళూ అల్లుళ్ళూ నోటమాట రానివారిలా బొమ్మల్లా నిలబడిపోయారు. కానీ మనవళ్ళు ముగ్గురూ మనవరాళ్ళు యిద్దరూ వారి దగ్గరగా వస్తూ చప్పట్లు చరచసాగారు.

"ఏమిటీ ముసలాయనా" యెబ్బెట్టుగా చూడసాగారు అల్లుళ్ళూ కోడలూ. "నాన్నగారేమిటీ యిలా చేస్తూన్నారూ" కూతుళ్ళు గుసగుస లాడారు.

యింత పెద్ద వాళ్ళు అయిన తర్వాత జోకర్లలా యిలా చేస్తూన్నారేమిటీ కోడలు భర్త చెవిలో గొణికింది.

"యెప్పుడూ యెంతో హుందాగా వుండే తండ్రి తనని తను మరిచి పోవటానికి కారణ యేమై వుంటుందీ" ఆలోచించసాగాడు కొడుకు.

యెవరి ఆలోచనల్లో వారువుండగానే రుక్మిణమ్మ మెడలో దండతీసి మనవరాలి మెడలో వేసింది.

"ఏమిటండీ యిదంతా" అంది.

"తర్వాత చెప్తాను. ముందు భోజనాల సంగతి చూడు. పిల్లలందరినీ రమ్మను." ఆయన అందరినీ కుశల ప్రశ్నలు వేసి బట్టలు మార్చుకుని వచ్చేశాడు.

రుక్మిణమ్మ పర్వనలో మునిగిపోయింది. కానీ ఆమె మనసు మనసులో లేదు.

యింక మిగతా వాళ్ళందరూ సస్పెన్స్ భరించలేకుండా వున్నారు.

"నాన్నకి లాటరీ యేమన్నా తగిలిందా" ఆయనకి లాటరీ టికెట్ కొనటం అలవాటు లేదే అనుకుంది ఝాన్సీ.

"భాగ్యలక్ష్మి లాటరీ గనుక తగిలితే 'వెస్పా' కావాలని మీనాన్నని అడిగి తీరాలి" పెద్దల్లుడు భార్య చెవిలో గుసగుసలాడాడు.

"చూడూ మీనాన్నకి యేరూపంలోనైనా డబ్బు వచ్చి వుండాలి. లేకుంటే రెండేళ్ళగా పిలవనివాడు పిలవటం యేమిటి. మనకి ఓ నాలుగు వేలు డబ్బు కావాలని అడుగు" చిన్నల్లుడు పథకం భార్యకి చెప్పాడు.

"నాన్నకి డబ్బెలా వస్తుందండీ" భయంగా చూసింది చిన్న కూతురు.

"అప్పుగానే అడగమన్నానని చెప్పు. అది ముందు తీసుకుందాం. తీర్చటం విషయానికి వచ్చినప్పుడు చూద్దాం."

చిన్న కూతురు గొంతులో వెలక్కాయ పడింది.

రుక్మిణమ్మకి మనసులో మహా ఆరాటంగా వుంది. పిల్లల యెదుట 'విషయం ఏమిటీ' అని అడగటానికి యిష్టం లేదు. అలా అని ఆయన ఒంటరిగా దొరికే అవకాశం లేదు. నిశ్శబ్దంగా ఓ అయిదు నిముషాలు కూర్చునేందుక్కూడా అవకాశం లేనంతపని. రుక్మిణమ్మ ఆలోచనలు పరి పరివిధాల పోతూన్నాయి. అయినా యాంత్రికంగా పనిచేసుకుపోతూ వుంది.

భోజనాలు అయ్యాయి. మధ్యాహ్నం ఫలహారాలు అయ్యాయి. టీలు అయ్యాయి. శివరావు క్షణం తీరుబడి లేకుండా మనవలతో చిన్న పిల్లాడిలా ఆటలు ఆడటంలో మునిగిపోయాడు.

"ఏమిటీ ఈయన వరస" వినుగ్గా అనుకుంది రుక్మిణమ్మ.

* * *

దీపావళి పండుగరోజు తలంట్లూ పిండి వంటలతో భోజనాలూ కబుర్లూ అయిపోయాయి. అత్తమామలు పెట్టిన కొత్త బట్టలు కట్టుకుంటూ పెద్దల్లుడు భార్యతో అన్నాడు.

"మీ నాన్న ఈ బట్టలతో సరిపెట్టేద్దాం అనుకుంటూ వుంటాడు. అలాక్కాదనీ నేఅడగమన్నాననీ అడిగావా"

"లేదు" అన్నట్లు తలవూపి గభాలున యేదో పనివున్నట్లుగా అక్కడినించి వెళ్ళిపోయింది శివరావు పెద్ద కూతురు.

చిన్నల్లుడూ 'డిటోనే

"ఈ పండక్కి నాన్న పిలిచి నన్ను చెడ్డ యిరుకులో పడేశాడు." వినుగ్గా అనుకుంది చిన్నకూతురు.

యింక కోడలు తనకి పెట్టిన 'చీరె' నచ్చలేదని మూతి ముడుచుకు కూర్చుంది. ఆవిడ చీరె కట్టుకోదు. భర్త కొత్త బట్టలు వేసుకుంటే వూరుకోదు.

"నమస్కారం చేద్దురుగాని రండర్రా" అని అక్షింతలు చేత్తో పట్టుకుని తల్లిదండ్రులని కుర్చీలో కూర్చోబెట్టి గట్టిగా అరుస్తోంది ఝాన్సీ.

అర్ధగంట తర్వాత అందరూ వచ్చారు. కొడుకూ కోడలూ కొత్త బట్టలు కట్టుకోలేదు అన్నది ఆయన దృష్టినుంచి పోలేదు. రుక్మిణమ్మ ఏదో అనబోతూ వుంటే 'మాట్లాడకు' అన్నట్లు చూసి అక్షింతలు వేసి ఆశీర్వదించాడు శివరావు.

ఝాన్సీ ప్రతి సంవత్సరం కంటే యింకాసిని ప్రమీదల్లో దీపాలు వెలిగించి తులసికి పూజచేసి వాకిట్లో పెట్టింది. టపాకులూ చిచ్చుబుడ్లూ మతాబులూ కాలుస్తూన్న మనవల పక్కన చేరి వారి ఆనందంలో తనూ పాలు పంచుకున్నాడు శివరావు.

పండగ ధూం ధాం మన్నట్లుగా గడిచిపోయింది.

రాత్రి భోజనాలు అయిపోయాయి.

తెల్లవారింది. మామగారు యేమైనా చెపుతారని యెదురు చూసిన అల్లుళ్ళకి నిరాశే యెదురైంది. కాఫీలూ ఫలహారాలు అయిన తర్వాత అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూండగా పెద్దల్లుడు మెల్లగా విషయంలోకి వచ్చాడు.

"మామగారూ... మరీ పండుగకి మమ్మల్ని అందరినీ రమ్మని రాయటంలో వుద్దేశ్యం యేదో శుభవార్త చెప్తారని వీళ్ళందరూ యెదురు చూస్తూన్నారు. వారితో బాటు నేనూ...."

శివరావుకి రెండు నిమిషాల వరకూ అల్లుడి మాట అర్థం కాలేదు. అర్థం అయిన తర్వాత ఆయనకి పెద్ద పెట్టున నవ్వు వచ్చింది. నవ్వేస్తూ అన్నాడు. "ఆ... నిజమే. మీకు శుభవార్త చెప్పాలి. చెప్పాలనే అనుకుంటూన్నాను."

ఈ మాటకి అల్లుళ్ళ గుండెలు ఆనందంతో గంతులు వేయసాగాయి. కూతుళ్ళ గుండె 'లబ్‌డబ్' మని కొట్టుకోసాగింది.

"ఇరవై నాలుగ్గంటలూ ఈ ఇంట్లో వుండే నాకు తెలియని ఆ శుభవార్త వీళ్ళకి చెప్పేది యేమై వుంటుంది" ఝాన్సీ కళ్ళింత చేసుకుని తండ్రి వైపు చూడసాగింది.

అందరూ నిశ్శబ్దంగా అయిపోయారు. రుక్మిణమ్మ వూపిరి బిగపట్టి చెవులు రిక్కించి వినటానికి సిద్ధంగా కూర్చుంది. కామేశం కిదంతా చిత్రంగా అన్పించసాగింది. తనకి బుద్ధి తెల్సిన దగ్గరనుంచీ యెలాంటి నస్పెన్సులూలేవు. యే కారణాలవల్లగానీ పొంగిపోయేంత పరిస్థితులూ లేవు. కృంగిపోయేంత పరిస్థితులూ లేవు. కానీ యివాళ యిలా వీరందరూ తండ్రి యేదో చెప్తారని వూహించటం యెదురు చూడటం యేదోగా అన్పించసాగింది. అయినా తనూ కుతూహలాన్ని అణుచుకోలేక పోతూన్నాడు. ఈ పరిస్థితిని కాస్తకూడా అర్థం చేసుకోలేని పిల్లలు తాతగారి చేతిని పట్టుకుని లాగుతూ 'ఆడుకుందాం రండి తాతగారూ' అనసాగారు.

"ఒస్తాను వుండండర్రా" అని వారికి సర్దిచెప్తూనే కొడుకు వైపు తిరిగి

"పిల్లలూ నేను 'రిటైర్' అయ్యాను. రేపు యెలా? అన్న విషయం కాక ఈ పండక్కి మీ అందరితో సంతోషాన్ని పంచుకోవాలని మాత్రమే మీ అందరినీ రమ్మని రాయటానికి కారణం అంతే" అంటూ శివరావు అక్కడ నుంచి వెళ్ళి మనవళ్ళ ఆటల్లో కల్సిపోయాడు.

అక్కడున్న అందరికీ ఒళ్ళు మండిపోయింది. రుక్మిణమ్మకి మాత్రం ఓ క్షణం గుండె ఆగిపోయినట్లే అయింది. ఆ తర్వాత సీరసంగా కొట్టుకోసాగింది. రేపటి నుంచీ యెలా యెలా? అన్న ప్రశ్న ఆవిడ కళ్ళ ముందు భూతంలా కదల జొచ్చింది.

అసంతృప్తిగానే అల్లుళ్ళు కూతుళ్ళు వెళ్ళిపోయారు.

"అమ్మా నాకో తమ్ముడన్నా లేనందుకు యిప్పుడు విచారపడుతున్నాను. నే ఒక్కడినీ మీ యిద్దరిని యేం భరించగలను చెప్పు. అయినా ఝాన్సీ బాధ్యత మీకుందిగా. తర్వాత చూద్దాం" అంటూ వెళ్ళిపోతూన్న కొడుకు భుజం మీద చెయ్యివేసి అన్నాడు శివరావు,

"చూడూ 'రిటైర్' అయ్యాను అన్నాను కానీ మా బాధ్యత నీమీద పెడతానని అనలేదురా"

'సరే' తేలిగ్గా వూపిరి పీల్చి వెళ్ళి పోయాడు కామేశం.

ఒక నెల అతిభారంగా గడిచిపోయింది. శివరావు యేదైనా మరో వుద్యోగం దొరుకుతుందేమో అని కాళ్ళు అరిగేలా తిరగసాగాడు. ఒక రోజు తిరిగి తిరిగి అల్సిపోయి ఇల్లు చేరిన శివరావుకి రుక్మిణమ్మ నవ్వు ముఖంతో యెదురుగా వచ్చి చెప్పింది.

"నాకు వుద్యోగం వచ్చిందండీ. భోజనం బట్టలు యిచ్చి నెలకి మూడు వందలు జీతం యిస్తాం అన్నారు. ఓ శ్రీమంతురాలైన వృద్ధురాలుని ఆత్మీయంగా జాగ్రత్తగా చూసుకోవాలి. ఆవిడ కొడుకు ఫారెన్‌లో వున్నాడుట. రెండు చేతులా సంపాదిస్తున్నాడుట. తల్లిని కన్న బిడ్డలా చూసే మనిషి కోసం చూస్తూన్నాడట. నా ఫ్రెండ్ ఒకామె ఈ విషయం నాకు చెప్పి ఈ వుద్యోగం వేయించింది ఈ రోజు చేరాను. యిందుకు మీరు ఏం అభ్యంతరం చెప్పరుగా. మీరు ఒక సారి అన్నారు, కష్టపడి చేసే యే వుద్యోగమైనా గౌరవప్రదమే నని. ఔనా."

"ఔను."

"ఔను అన్నారుగా నాకదే సంతోషం. అదీ కాక పాతకాలంలో భార్య అంటే భర్త 'నీడ' కానీ ఈ కాలంలో 'భార్య భర్తకి 'నీడ' కాదు 'తోడు' అంటాను మీరేమంటారు.

'నిజం... .నిజంగా నిజం రుక్కూ' ఆయన కళ్ళు ఆనందబాష్పాలతో నిండిపోయాయి. □

మల్లె పువ్వులు కళ్ళపై పెట్టి కట్టు కట్టి పట్టయితే కళ్ళ వెంట నీరు కారడం, కళ్ళు ఎరుపెక్కడం, కళ్ళమంటలు తగ్గిపోతాయి.